


# ప్రేమాయణంలో!

రజనీ, మరియా, నూర్ బేగం, హెలెన్ జేమ్స్ సోషల్ వర్క్ చేస్తూ వూళ్ల వెంట తిరుగుతున్నారు. మాటల సందర్భంలో తమ సహాధ్యాయి చిన్ననాటి ఫ్రెండ్ మైథిలి వున్నదీవూరేనని తెలిసింది. సంఘానికి సేవ చేస్తూ తమకు తాము సేవ చేసుకుంటూ మైథిలి అడ్రసు సంపాయించి, చూడటానికి వెళ్లారు.

''రండి, రండి, శ్రమ తీసుకున్నారే? నన్ను మరిచిపోయివుండాలనుకున్నాను. సంతోషం. నేను మీకు చేసిన వుపకారమేమీ లేదు''.

మైథిలి వున్న యిల్లు చిన్నదైనా వసతిగా వున్నది. పరిసరాలు బావున్నాయి. పొద్దాకగానే పైరుగాలి తిరుగుతుంది. అన్నీ అందుబాటులో వున్నాయి. బయట మరి నలుగురి పిల్లలతో యిద్దరు పిల్లలు ఆడుతున్నారు.

''మైథిలి యిల్లిదేనా?'' అనడిగితే, ''యిదే. మా అమ్మ'' అన్నారు. లోపల డ్రాయింగ్ రూమ్‌లో పక్కగా కిటికీ వున్నవేపు వూయలలో నెలల పాప వూగుతున్నది.

సుఖాసీనులైనారు. మధ్యలో గుండ్రని పేము బల్ల. ట్రేలో చిన్న ప్లేట్లలో, మినప సున్ని, బిస్కట్లు, సన్నని కారప్పూస, వేయించిన మినప్పిండి వడియాలు, మిరప్పుళ్లు నూరి కలిపి పెట్టినవి యెదురుగా వుంచింది మైథిలి. మరో ట్రేలో టీ బియ్యప్పిండి వడియాలు మంచి నీళ్ల గ్లాసులు తెచ్చింది.

రజని నాజూగ్గా తింటూ అన్నది ''మెడిసిన్ చదువుతున్నావో, ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నావోనని వూహిస్తూ వచ్చాము మైథిలీ! సంసారసాగరంలో యీదుతున్నావని తెలియదు. సాగరంలో ప్రమాదవశాత్తూ పడ్డావా? జాలరి వేసిన యెర ఆకర్షించిందా? అప్పుడే మూడు చేపలని గూడా సాగరంలో వదిలావే! మెనూహిన్ అనే గొప్ప వాయులీన విద్వాంసుడు తన చిన్న భార్యతో నెహ్రూ

పండితుని చూడటానికి వచ్చారు. ఆ చిన్న భార్య పండితునితో,

''కాశ్మీరీ బ్రామిన్ని చూస్తాననుకుంటే యింగ్లీష్ లాయర్ని చూస్తున్నాను'' అన్నది.

నూర్ టీ అందుకున్నది. ''జుట్టంతా వూడిపోయిందే మిత్రమా! పెద్ద జడ వుండేది. వున్నత పాఠశాలలో చదువుతుండగా నికార్సయిన యిల్లాలు లాగా వేలు ముడేశావే! హిందూ గృహిణిలాగా లేవేం? వూహకందటం లేదు'' అన్నది.

హెలెన్ వడియాలు తింటూ ''హాపీ గానే కనిపిస్తున్నావు. మిస్టరీ నువ్వే విడదీయాలి'' అన్నది.

రజని మంచినీళ్లు తాగి అన్నది ''అన్ని ఐటమ్సూ చాలా రుచి మైథిలీ. బజారు సరుకుగాదు. హోమ్ మేడ్. నువే చేశావా? లైట్ బ్రౌన్ రంగులో వడియాలు యెంత రుచి! నేతితో చేసినట్టున్నావు. కారప్పూస బంగారు రంగులో వుండి తింటుంటేనే కరిగిపోతున్నది'' అని రిమార్కు చేసింది.

''మనసులో నిలిచివున్న అభిమానం అలా పలకిస్తుంది మిత్రమా. నేనే చేశా. పదార్థాలు మంచివీ, మంచి నెయ్యీ శ్రద్ధా వుంటే అలా తయారౌతాయి. థాంక్స్. ఐస్ క్రీమ్ వేఫర్స్ పెట్టలేదనుకుంటారనుకున్నా'' అన్నది మైథిలి తాను కూచుంటూ.

రజని, '' ఇవే బాగున్నాయి. రుచి లేచి వచ్చింది. టూకీగా రామాయణం లాంటి ప్రేమాయణం చెప్పేయి. లైఫ్‌లో సెటిల్‌గావాలన్నట్లుండేది గాదు నీ వైఖరి. వినిపోతాం'' అన్నది.

''వుండండి. శ్రమ తీసుకున్నారు. ఈ పూట వుండి పొద్దున్నే వెళ్దురు గాని'' అన్నది మైథిలి.

హెలెన్ కారప్పూస తింటూ అడిగింది ''రింగ్ ఫింగర్‌కి రింగేదీ?''

నూర్, ''నిక్కా యేదీ మెడకీ?'' అడిగింది.

'' ఐదు వరాలివి కాదూ?'' అన్నారొక్కసారిగా.

కథా నిలయం
5451
శ్రీకాకుళం

'' ఐదు వరాలినే. మోడరన్ ఐదు వరాలు''.

''కానీ మరీ! మిస్టరీ విడిపోవాలి''.

''యుద్ధకాండ వున్నదా ప్రేమాయణంలో? పెద్దదేనా?'' బేగం అడిగింది.

''మా మతగ్రంధాలు చదవలేదనుకున్నా. బాగా తెలుసే'' అన్నది మైథిలి. వుయ్యాలలో కూన యేడుస్తుంటే లేచి వెళ్లింది. పక్కమార్చింది. పాలుతాగించి, సీసా అవతలుంచి వచ్చింది.

''హెల్దీ బేబీ గాదూ! అలా వీగ్గా వుందేం యేడుపూ?'' రజని అడిగింది.

''డాక్టరుకి చూపించా. లివర్ పాడైంది బాగౌతుంది. హోమియో వాడమన్నాడు డాక్టరు. వాడుతున్నా'' అన్నది మైథిలి వుయ్యాల వేపు చూస్తూ.

''యేడో నెలా? కూచోవాలని ట్రై చేస్తున్నదే''.

''అల్లోపతీ యిష్టం లేదా? హోమియో డాక్టరు దగ్గర్లో వున్నాడా?''

''దూరమే. అల్లోపతీ వాడటం బాధాకరం. హోమియో వాడటం సులభం. ఈయనకి బాగా పేరున్నది'' అన్నది మైథిలి.

సూర్యాస్తమయమైంది. ఆకాశానికి ధూసరవర్ణం వచ్చింది. వీధి లైట్లు వెలిగినై. మైథిలి లేచి లైట్లు వేసింది.

వీధిలో బండి ఆగింది. జనులు దిగి స్వతంత్రంగా లోపలి కొచ్చారు. కొంగుముడి విప్పి బాడుగ యిస్తున్నది తల్లి. తక్కిన శాల్తీలు సంచీలతో మూటలతో లోపలి కెళ్లారు. ముక్కు పీక్కుంటూ చూరువంక చూస్తూ మెట్లెక్కి వచ్చింది తల్లి.

లోపలున్నవారిని వాలు చూపులు చూసింది. కిచెన్ లోంచి దొడ్లో ప్రవేశించింది. అందరూ కాళ్లూ చేతులూ శుభ్రం చేసుకున్నారు.

మిత్రులు మైథిలి వంక చూశారు.

"ఆత్మీయులే. తల్లీ, తోడబుట్టినవాళ్లూ, కజిన్సూ" అన్నది నవ్వటానికి ప్రయత్నిస్తూ.

తల్లి రాగానే చెప్పింది "వీళ్లు నా చిన్న నాటి సహాధ్యాయులు. సంఘసేవ చేస్తూ నా వునికి తెలిసి వచ్చారు" అని పరిచయం చేసింది.

తల్లి లోపలికెళ్లి కాఫీ చేస్తున్నది. తక్కినవారు కూచున్నారు.

కొద్ది దూరంలో ఒక ఫ్లాట్‌లో ఓ ఆర్టిస్టున్నాడు. కళ్లు లేవు. ప్లేబాక్ సింగర్. వయసు మళ్లినా అట్రాక్టివ్. చక్కగా డ్రెస్ చేసుకుంటాడు. ఆయన పొద్దాకి ఫిల్మ్ సంగీతం, కర్ణాటక సంగీతం నేర్పుతాడు.

పిల్లలు గొంతు తార స్థాయిలో "లంబోదర లకుమికర" అని అందుకుని పాడుతున్నారు.

"బిగిన్ చేయి. ప్రేమికుడే నా ప్రేమాయణం సాగిస్తూ ప్రపోజ్ చేసిందీ?" అనడిగింది రజని.

"ప్రపోజ్ చేశాడనే కన్న యింద్రజాలం ప్రయోగించాడంటే బాగుంటుంది. జాలికుని ఐడియా ఒక స్త్రీని పట్టాలని. దాని ద్వారా కొంత లాభం కొన్ని కష్టాలు తొలగుతాయి. నేనది గ్రహించలేదు. పెద్ద డిగ్రీ అనే రంగురాయి యెరగా కట్టి గాలం విసిరేప్పటికి, నీళ్లలో వున్న నేను తినే చిన్న చేప అనుకుని నోట కరిచేప్పటికి గాలం పైకిలాగేశాడు. సంతోషించి, చాలా శ్రమించలేదని, యెర తొలగించి చేపను బుట్టలో వేశాడు" మైథిలి నవ్వుతూ అన్నది.

పంజాబీ డ్రెస్ వేసుకున్న పదేళ్ల పిల్ల వచ్చింది. రెండు జడలు. "పిన్నీ!

అక్కకు పెళ్లి చూపులు జరుగుతున్నాయి. పెళ్లి వారిలో యిద్దరమ్మాయిలు బాత్ కెళ్లాలని నన్నడిగారు. అటువంటిది లేదంటే సిగ్గు చేటని వాళ్లిద్దర్నీ యిక్కడికి తెచ్చాను. వాకిట్లో వున్నారు. ఈ ట్రేలు నేను తీసికెళ్లి క్లీన్ చేస్తా'' అని నవ్వింది.

మైథిలి లేచి వెళ్లి కొత్తమ్మాయిల్ని పిలిచి, బాత్ రూమ్ చూపించి వచ్చింది. ''అప్పుడే వాసనబట్టి అబ్జక్షన్ లేవదీశారు. వాళ్ల మీద యే జాలమూ పనిచేయలేదు. మదర్ టెర్రరిస్టులాగా అయి వెల్‌లోకి జంప్ చేసింది'' అన్నది మైథిలి.

'' ఇంకా నయం! మందుపాతర పెట్టించక పోయింది! తెలిసే గడుగ్గాయిలాగా బుట్టలో వేసుకున్నాడేమో హీరో!'' అన్నది నూర్.

''కరెక్ట్. తన ప్రైవసీ కాపాడుకోవాలనే అలా చేశాడు. కొంతమందికి ప్రైవసీ అమూల్యంగా తోస్తుంది. యాక్ట్రెస్ గ్రేటాగార్బో అంతేట''.

నవ్వుతున్న మిత్రులను చూసి కంటిన్యూ చేసింది మైథిలి.

''దగ్గర వారూ ఎక్సైటై తామూ దూకారు టాంకులోకి''.

''అంత పెద్దదా బావీ?'' అన్నది హెలెన్.

''పెద్దదేనట. అనవసరంగా దూకావు. పైకి పోదాం. తాళ్లు దింపుతున్నారు'' అని మదర్ని పైకెత్తి పట్టుకున్నారు. వాళ్లు గజయీతగాళ్లు. నేను నా వంటి మీద బంగారమంతా అమ్మి, నాకు పసుపు కుంకుమ కింద నా వారిచ్చిన భూమి అమ్మి వీడి చదువు పూర్తి చేయించి, నా సహోదరునితో సంప్రదించి, జాబ్ గూడా చూపిస్తే ఇదెవతే? వాడిని సెడ్యూస్ చేసింది?'' అని గొల్లుమన్నది.

''అదేం చేయగలదూ? నీ యింటికెలా వస్తుందీ? సాక్ష్యాలూ, మంత్రాలూ, శాస్త్రమూ పెద్దల పర్మిషనూ యేవీ? దాని ఆటలు సాగవు, చెల్లవత్తా తల్లడిల్లకు. నీ దైవం నీ రాముడు నీ పక్షం. దాని దోవనదెక్కడో

యేడుస్తుంది. నువ్వు నీ ముద్దుల కొడుక్కి నీవు సెటిల్ చేసిన కులమింటి కోతినే అంటగట్టుదువుగాని. దాని పక్షం పల్కటానికి లా గూడా లేదు. పైకి పోదాం. తాళ్లొచ్చేసినై'' అని తాడు నడుముకి బిగించారు. పైకొచ్చి ''తల్లి గాబోతున్నాదన్నారే. ఆస్తిలో వాటా యివ్వాలా? ఇవ్వను. నా పేరే వున్నది'' అన్నది.

''అక్కర్లేదు పిన్నీ. నన్ను నమ్ము. తల్లి అయినా అమ్మమ్మయినా దాని పంటిసలుపు దానిదే. మేము నీ పక్షమే''.

''అమ్మది వీక్ హార్ట్. దాన్ని ఇంటికి తేవోకు అని చెప్తాం''.

''అంటకట్టారా?'' అనడిగింది మరియా.

''చేతగాలేదు. చేతనైతే బావుండేది'' మైథిలి నవ్వింది.

చొరవగా మరో పిల్ల లోపలికొచ్చేసింది. అక్కడున్న కొత్త మొహాల్ని గమనించకుండా ఫ్రీగా అన్నది.

''దొడ్డా! బావ వూడిపడ్డాడు. భోపాల్లో జాబ్ వచ్చిందిట. చేరాడట. క్వార్టర్లు, నీళ్లూ, లైట్లూ, నౌకరు, డ్రైవరు జీపూ అన్నీ ఫ్రీట. శలవు పడేసి వచ్చాడట. అక్కకు శోభనం కానిచ్చి పంపమన్నాడు. నాన్న అర్జంటుగా పంచాంగం చూశాడు. ఇవాళ మంచిరోజు. వర్జ్యం లేదు చవితి అని పరెగెత్తుకెళ్లి పురోహితుడిని తెచ్చాడు. అన్న తన స్నేహితుడి స్కూటర్ మీద వెళ్లి అప్పుపెట్టి బట్టలు తెచ్చాడు. అమ్మా అమ్మమ్మా వంటలు చేస్తున్నారు. నేను వెళ్లి అయిదిళ్లలో పేరంటం పిలిచి వచ్చాను. నవారు మంచం, పరుపు తలగడ , రెండు కొత్త దుప్పట్లు కావాలిట. మొదటి కూతురుగదూ వేడుక చేసి పంపాలిట. అత్త కొడుకు రామూ, పిన్ని కొడుకు దామూ వచ్చి వాకిట్లో నిలబడి వున్నారు. నిన్ను పేరంటం రమ్మన్నది అమ్మ'' అని బొట్టు పెట్టింది.

'' ఆ బెడ్ రూమ్‌లో వున్నాయి తీసి కెళ్లమను సుశీలా''.

ఇద్దరు మగబిడ్డలూ వచ్చి అలాగ్గా అన్నీ కలెక్ట్ చేసి తీసికెళ్లారు.

మిత్రులు నోరు దెరిచి చూశారు ''మేమింక వెల్తాం మైథిలీ. మీ ప్రేమాయణం మరోసారి వచ్చి వింటాము. కంటిన్యూ చేద్దువుగాని'' అని లేచారు.

మైథిలి తల్లి ముసుగు పీక్కుంటూ ముక్కు నలుపుకుంటూ వచ్చింది.

''కూచోండి ముగ్గురూ. వెళ్లకండి. మా కోసం బస్ వస్తుంది. భోజనం చేసి అందరం కలిసి వెల్దాము. మేమే పెల్లికి వెళ్తూ కూతుర్ని చూసి పోదామని దిగాము. దాని బిడ్డ జబ్బుగా వుంటే ''అయ్యో కూన జబ్బు పడిందనన్నా అనటానికి అవసరానికి వచ్చేవారికి నోరుబడిందా? మన బంగారం మంచిదైతే అని సామెత. మా అమ్మాయే అందరికీ వెరుస్తుంది. మెతక. నోట్లో నాలుక లేదు. వంచకుడిని బ్లాక్ మెయిల్ చేసే అవకాశమున్నా వాడుకోదు. మాతో వత్తురుగానీ. యే వూళ్లో దిగాలో చెపితే దింపిపోతాం. బేరం ఫైసల్ చేసేవచ్చా'' అన్నది వూగుతూ.

''థాంక్స్ ఆంటీ'' హెలెన్ లేచి అన్నది.

''నీ కెంత నాగరకతున్నదమ్మాయ్! నన్నందరూ, మామ్మ, అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మ అని పిలుస్తూ బాధ కలిగిస్తారు. నేను అర్ధశతాబ్దమన్నా చూడలేదు. జుట్టన్నా నెరవలేదు చూడు'' ముసుగుతీసి చూపించింది.

గుండు కనపడకుండా చిక్కని వుంగరాల జుట్టు తలంతా కప్పి కనిపించింది. ముసుగేసుకుని లోపలికెల్లింది తల్లి.

యెనిమిదేళ్ల పిల్లవాడు వచ్చాడు ''అత్తా మా నాన్నియ్య చిన్న గిన్నెడు నెయ్యి బదులు తెమ్మన్నాడు. అమ్మేమో అన్నం వుడకేసి కందిపచ్చడి చేసి ఒగరుస్తూ ఆయాసపడుతూ దగ్గుతూ పడుకుంది. నిన్ననే గుర్తు చేస్తే, ''సోమవారం ప్యాకెట్ కొని తెస్తా. ఇవాల్టికి మైథిలి అత్తనడిగి బదులు తెచ్చుకోండి'' అన్నాడు.

మైథిలి అప్ప శారద వచ్చింది వంటింట్లో నించి. ''గిన్నె యిటుతే వెంకట్''

అని అందుకుని తీసికెళ్లి పేరిన నెయ్యి నింపి తెచ్చి కూర నింపిన గిన్నె గూడా అందించింది వెంకట్‌కి. వెళ్లిపోయాడు. నిలబడి చూసింది శారద. ''యేమంటున్నది మైథిలి? తనను మోహించివచ్చాడంటుందా? కల్ల. నన్నే ముందు మోహించాడు హీరో. దీనికి వశీకరణ మంత్రం వచ్చు. మందు పెట్టి మనసు విరిచి వాడిని నాకు దూరం చేసింది. ''అన్యాయం మైథిలిని నమ్మకు'' అని అరిచినా చెవిటివాడల్లే చూసి దాన్నే తగులుకున్నాడు. దాంతో మైథిలికి కళ్లు నెత్తికెక్కినై. నన్ను గూడా కోమిస్ట్రస్‌గా వుండనీ అంటే ససేమిరా అని తలుపులేసుకున్నది. ఇనప్పెట్టెలాంటి యిల్లు మాట్లాడి దాంట్లో దాచి తాళం బిగిస్తుంది. మీకూ దానికీ తెలియనిది నాకు తెలుసు. హీరో దక్షిణనాయకుడు. పేరు మోహన వంశీ. వాళ్లమ్మ సెలెక్టు చేసిన దానికి తాళి కట్టి దాని తాత దగ్గరుండమన్నాడు. పిల్లలు పుట్టారు. ఆహాహా వంశీకి దీనిలాంటి లేడీ లవర్స్ యింకా వున్నారు. అంతా దాక్కుని పిల్లల్ని గని పెంచుకుంటున్నారు. అదంతా చెప్పి 'నేనూ కంటాను. నా సొమ్ము నేనే తింటాను జాబ్ వున్నది' అంటుంటే ఇహిహీ అని నవ్వి పారిపోయి దీని స్కర్ట్ వెనక దాక్కున్నాడు. హి సేవ్స్ హిజ్ స్కిన్ అదీ వాడి తత్త్వం'' అంటున్నది.

శ్రోతలు వింటున్నారు. తల్లి వచ్చి ''అమ్మాయ్ మైథిలీ! దానికి పున్నానికీ అమావాస్యకు యెక్కువౌతుంది. ఇన్‌జెక్షన్స్ కొని వుంచమని ఫోన్ చేశానే. అక్కడలేవు, అయిపోయాయి అన్నాడు షాపువాడు. డాక్టరు దగ్గరికి తీసుకుపోవాలి. దోవలో మెడికల్ హాల్ కంటబడ్డది. బండి ఆపించి కొనుక్కుపోదాం. డబ్బు నా కొంగునే వున్నది'' అని కొంగు విప్పబోయింది.

''కొని వుంచానమ్మా'' అన్నది మైథిలి.

''నేను ఆక్జిలరీ నర్స్ ట్రైనింగ్ అయినాను ఆంటీ. సోషల్ వర్క్ చేస్తూ యిటుగా వచ్చాము. నేనిస్తా'' అని లేచింది రజని.

తినేవి యెదురుగా వుంచి కుర్చీలో కూచోబెట్టారు. డ్రింకు సీసాలో

పుల్లవేసి అందించారు. శారద సీసాను బల్లమీదుంచి తినటానికుపక్రమించింది. రజని ఇంజక్షనిచ్చి, పనికిరాని సిరెంజిని వేస్ట్ పేపర్ బుట్టలో పడేసి వచ్చి కూచున్నది.

''వేడిగా తింటారని వడ్డించేస్తున్నా అమ్మాయ్. చేతులూ కాళ్లా కడుక్కోవాలా?'' అని వెళ్లి గోద్రెజ్ బల్ల తెచ్చి దాని మీద టేబుల్ క్లాత్ పరచింది తల్లి. మైథిలి, పళ్లేలు, గ్లాసులు, నేతి గిన్నె పెరుగుగిన్నెలు వూరగాయలున్న గిన్నెల స్టాండూ అమర్చింది.

''బాత్‌రూమ్‌లో సబ్బు టవలూ వేడి నీళ్లతో కళాయి వున్నాయి'' అన్నది.

తల్లీ కూతురూ సర్వ్ చేశారు. తక్కిన వారూ శారదకి కిచెన్ అవతల వరండాలో బల్లలమీద కానిస్తున్నారు.

భోజనాలౌతున్నాయి. మాటలూ వినబడుతున్నాయి.

'' అమ్మాయ్ మైథిలీ! అన్న వ్యాపారం సన్నగిల్లి లాభాలు తేవటం లేదు. అమ్మేసి ముంబాయి వెళ్తున్నాడు. స్టీలు కారేజీ సగం ధరకమ్ముతున్నానని తెచ్చాడు. అయిదు గిన్నెలు. నువ్వు కొనుక్కో. అవసరానికుంటుంది''. మరొక గొంతు ''టికెట్టుకి డబ్బు కావాలి మైథిలీ! ఇంటర్వ్యూకి వెళ్లాలి విజయవాడ. ప్రస్తుతం చేస్తున్నది టెంపొరరీయే. అయిపోయింది. విజయవాడలోని గవర్నమెంట్ జాబ్''.

''నా దగ్గర లేదు. మదుపు పెట్టనిదీ వస్తుందా?'' మైథిలి.

''నీ నగలు వెండి పళ్లెం కుదువపెట్టి తేగలను. తర్వాత నువ్వు మెల్లిగా తీర్చుకోవచ్చు. అన్నకు వయస్సు యెక్కువైతే యివ్వరు''.

''అన్ని నగలు లేవే?''

''పోనీ నీ చేతి రెండు గాజులే యియ్యి. నేను నీకు పెట్టిన వెండి ముక్కోణం గొలుసులుండాలే. పిల్ల మెడలో రెండు తులాల గొలుసు

పెట్టావుగా. తాళాలేవీ? నే చూస్తా'' తల్లి గొంతు.

అలా డైలాగులు వింటూ భోజనాలు కానిచ్చారు మిత్రులు.

'' ఇది కొత్త చీరేనా? గడి విప్ప లేదల్లే వున్నదే? నేను పెళ్లి కూతురుకి పెట్టాలి. మేనత్తను గదూ! ఇది తీసికెళ్తున్నా. అరె! దీనిలో రవికల గుడ్డా వున్నది. పూలు కుట్టినదెంత బావున్నదో!''.

పది అవుతున్నది. మైథిలికి స్వయానా పింతల్లి వచ్చింది.

''మైథిలీ! మా రెండో అమ్మాయి అనూరాధకి సంబంధం ఖాయపరిచాము. వేడుకకి పెళ్లిచూపుల కొస్తారు పెళ్లివారు. మీ యిల్లు చెప్పాను. రేపు అయిదింటికి కాఫీ ఫలహారాలు సిద్ధంగా వుంచు'' అని నవ్వి, ''విస్సీ నడిగి గాజులూ గొలుసుకి డబ్బు గుంజి తేవాలి. వేలు విడిచిన మరిది. నీవూ తెలుసువాడికి'' అని వీపుతట్టి వెళ్లిపోయింది.

పదిన్నర అయింది. మోహనవంశీ వచ్చాడు. అందర్నీ కలయజూచాడు. మైథిలి భోజనం చేయమన్నది. తల్లి నవ్వుతూ పళ్లెం పెట్టి వడ్డిస్తున్నది.

''వీలు లేదు. మా అన్నాయికి ఆస్థ్మా యెటాక్. తన్నుకుంటున్నాడు. మా అమ్మకు యెనీమియా. పడక వేసింది. మా నాన్న కాలు పడిపోయింది. చెపితే వింటేనా? నర్సింగ్‌హోమ్‌లో చేరనని మూర్ఖించాడు. నేనే చూడాలి. లేదా మనిషిని పెట్టాలి. వెతుకుతూ వచ్చాను. మైథిలీ వేడుకేదైనా చేసుకుంటున్నావా? వేడుకలు చేయద్దని నీకు వార్నింగ్ యిచ్చానే? పిల్లలు కలిగారు సంతోషంగా వుండి ముద్దుగా పెంచుకో డబ్బు పారేస్తానని ఒప్పందం చేస్తినే'' అని పోబోయాడు. నిలబడే వున్నాడు.

శారద వచ్చి వంశీ చెయ్యిపట్టుకు కదిలిస్తూ, ''నాకూ్కడా పారేయవూ వంశీ! నేను సంతోషంగా పెంచుకుంటాను''.

వాకిట్లో నిలబడివున్న ఫ్రెండ్ పిలవగా వంశీ స్కూటరెక్కి వెళ్లిపోయాడు.

మైథిలి అక్క కూతురు కుముదినీ ఆమె భర్త రమేష్ కార్లో వచ్చారు. దిగిలోపలి కొచ్చేశారు. ఆసీనులైనారు.

''మైథిలీ పిన్నీ! నాకు నెల తప్పింది. నువే పసుపు కుంకుమ యివ్వాలి. మా అమ్మ పోయింది గదూ! మా అత్తగారూ అదే అన్నది''.

''రెండో నెలలో సూడిదలివ్వరే?'' అన్నది మైథిలి.

రమేష్ నవ్వుతూ విశదీకరించాడు. ''నాకిటువంటి మూఢ నమ్మకాలు లేవత్తగారూ. తరవాత చూద్దాంలే వేడుక యెవరు యెప్పుడు చేయాలి అనంటే'', మీ ముద్దుల కుమార్తె కుముదిని,

''మీ పేషంటు, మా పిన్ని వున్నవూరు అదే పేట వెళ్తున్నాడంటే'', మళ్లా మీ చేతిది వదలటమెందుకని బయలుదేరదీశా''. ''పోనీ అయిదో నెలలో గాజులు తొడిగొంచు పిన్నీ. పెళ్లికి రమ్మని బలవంతంగా తీసికెళ్లిందిందుకే. తల్లి తరవాత తల్లివి'' అని కన్నీళ్లు తుడుచుకున్నది కుముదిని.

''శారద పిన్ని తనంతట తనే నీ పెళ్లి కొచ్చిందిగా?''.

''శారద పిన్ని నష్టజాతకురాలు. విడో. ఆమె యెలా యిస్తుందీ? నువ్వు పునిస్త్రీవీ, బిడ్డల తల్లివీ, దైవం లాంటి భర్త వచ్చాడు నీకు. అందుకని నువే వచ్చి కడుపు చల్లగా సుఖప్రసవం కమ్మని దీవిస్తూ చలిమిడి చేసి నా ఒడిలో వుంచాలి. నేను నీ వల్లేనే సుఖంగా పిల్లల్ని కనాలి. ఖర్చులు నీవే. చీరా రవిక గాజులూ తీసుకురా మరిచేవు'' అని లేచింది కుముదిని. రండి పోదాం. కారు తోలుకుంటూ తెచ్చిన మీ స్నేహితుడే మనుకుంటాడు?'' అని రమేష్ని లేవదీసి తీసుకుపోయింది.

పదకొండున్నర అయింది. పిల్లలు నిద్రబోతున్నారు. తల్లి ప్రయాణానికన్నీ సద్దుతున్నది. అశోక్ లేలాండ్ రానే వచ్చింది. కొత్త బస్. మెరుస్తున్నది.

''బయలుదేరుతున్నారా అమ్మాయిలూ? మిమ్మల్ని దింపేసి మా దోవన

మేం పోతా'' వక్కపొడి నములుతున్నద్ది తల్లి.

అప్పుడు వాకిట్లో బండి ఆగింది. పట్టు చీరా రవికా కట్టి యెర్రని బొట్టుతో వంశీ తల్లి దిగి మెట్లెక్కి లోపలికొచ్చింది.

కళ్లప్పగించి నిలబడ్డారింట్లో వాళ్లు. మైథిలి చూస్తున్నది.

''నా మనుమరాలి పెళ్లి ఖాయపరిచాము. నువ్వు రావటానికి వీల్లేకుండా, నిన్ను పిలవటానికి వీల్లేకుండా చేసుకున్నావు. అయినా ఆ యింటికి చెందిన దానివేనంటుంది పెళ్లి కూతురు తల్లి. నీ ఆశీర్వచనం పొంది రావాలని పట్టుబట్టింది. పగటి పూటెలా వస్తాము? నువ్వు ఒకత్తెవు పోగుబడ్డావనీ, సంతుగూడా కలిగిందనీ నాకు తెలియదు. మా వంశీ అన్నీ దాచుకున్నాడు. నాతో మొదటినించీ విపులంగా చెబితే నీకీ అవస్థ వుండేది గాదు. పదిమందితో కలిసి వుండేదానివి. మా ఆచారాలు నేర్పేదాన్ని. మా వాడు ఒప్పిస్తే మాత్రం, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ కెందుకొప్పుకున్నావు? గర్భస్రావానికి తలవంచావన్నారు. అదేం రోగం? దైవం మెచ్చి యిస్తుంటే కనిపెంచాలి. నా కెందుకులే? నా హయాం ముగియ వచ్చింది. ఇంకో పదేళ్లుంటానేమో. బండిలో వున్నది పెళ్లికూతురు. వచ్చి దీవించి కానుక యివ్వు'' నిలబడే వున్నది వంశీతల్లి.

''మీరే చేయండా పని. నేను ఆ యింటి మనిషిని కానని ధృవీకరించారు వంశీ. అధికారమూ, హక్కూ ప్రయత్నించినా రావు నీకు. నేను మంచివాడిని గనక డబ్బు పారేస్తున్నాను'' అన్నారు వంశీ.

''వంశీ యేమన్నాడనిగాదు యిప్పుడు. నువ్వు దీవించు'' అంటున్నది.

వంటింట్లోంచి తల్లి కేకవేసింది ''వెళ్లవోకు. వెళ్లనీయకండి అమ్మాయిలూ, కొడుకు చేసిన వంచన చాలక తల్లి వచ్చి వంచించి యెత్తుకు పోయి తనింట్లో పనిమనిషిగా పెడ్తుంది. అదీ ఆలోచనా ఔదార్యం! విన్నారుగా అమ్మాయిలూ ప్రేమాయిణం!'' అన్నది.

ముగ్గురు స్నేహితులు మైథిలి వెనక నిలబడ్డారు.

శారద వచ్చింది. ''నేవస్తా మీ యింటికి. మీరు చెప్పినవన్నీ చేస్తా. పోదాం రండి అత్తగారూ. నేనూ దీవించగలను. నువ్వు వంటింట్లోకి పోవే మైథిలీ'' అని నెట్టింది చెల్లిని.

''యేం చేదా? శారదా! చక్కగా తోడ్కెళ్లి తన మనమడిని దత్తు చేయించి నీ ఆస్తి లాగేస్తుంది. నీకు అమ్ముకునే హక్కుగూడా వుండదు. భరణం వస్తుందంతే'' అని వురిమి వచ్చి శారదను లాక్కెళ్లింది తల్లి.

పన్నెండవుతున్నది. బండిలోంచి యిద్దరు ముత్తయిదువలు పెళ్లికూతురు రెక్కలు పట్టుకుని దింపి తెచ్చారు. మొక్కించారు.

పని నెరవేరింది. అంతా వెళ్లి బండెక్కారు. బండి కదిలిపోయింది.

4

అశోక్ లేలాండ్ పూలరథమల్లే వున్నది. అందర్నీ యెక్కించింది తల్లి. బస్ స్టార్టౌవుతుండగా ముగ్గురు మిత్రులూ కిటికీలలోంచి చేతులూపుతూ నవ్వుతూ అన్నారు.

''ప్రేమాయణంలో పిడకలవేట బాగున్నది మైథిలీ! నిన్ను వెతుక్కుంటూ వచ్చినందుకు మంచి వినోదం లభించింది. మళ్లా కలుసుకుందాం''.

మైథిలి రాని నవ్వు నవ్వుతూ చేయి వూపింది.